# తక్కువ మనిషి

బ్యాంక్ రాబరీ అనే సినిమాతో దేశంలో దొంగల ముఠాలు పెరిగిపోయాయనీ మర్డర్ అనే సినిమా వొచ్చాక కొత్త హంతకులు బయలుదేరారనీ; దేవదాసు సినామా తాగుబోతులని తామర తంపరగా పెంచేసిందని ఛాందసులనేకులు సినిమాలని ఆడిపోసుకుంటారు కానీ నిజానికి సినిమాలు మనుషులని తయారు చేయజాలవు. సినిమాలని చూసి మనుషులే అలా తయారవుతారు. కావాలంటే కామేష్ కథే చూడండి.

కామేష్ అనేదిసినిమాలు చూసి సీరియల్సు చదివీ అతనికతను పెట్టుకున్నపేరు. అమ్మానాన్నా బారసాల నాడతనికి పెట్టిన పేరు కామేశ్వరరావ్.

సదరు కామేశ్వరరావు ఉరఫ్ కామేష్- ఆ మధ్య ఏమీ తోచక - తోచీ తోచనమ్మ తోటికోడలు పుట్టింటి కెళ్లినట్లు ఓ తెలుగు సినిమా కెళ్ళొచ్చాడు. సినిమా నుండి వొచ్చాక నిద్ర రాక టీవీ పెట్టాడు. అది దర్శింపజేసిన సింగిల్ ఎపిసోడ్‌లో మరింత నిద్రపట్టక పత్రికలో ఓ సీరియల్ భాగం చదివాడు. సర్వమతాల సారమూ దేముఒకకడే అయినట్లు- ఆ సినిమా, టీవీ కథ, పత్రికా సీరియల్ కథాంశం ఒక్కటే, పగ. ఒంటిచేత్తో చప్పట్లు సాధ్యం కాదుకదా? ఒకరు పగ తీర్చుకుందుకు- అవతల మరో అమాయకుడుండాలి కదా బలి పశువులా? తనొకందుకు పోస్తే అతను మరొకందుకు తాగాడన్నట్లు వీళ్లేమో రెబల్‌స్టార్‌ని రివెంజ్‌హీరో ఆ ప్రతీకారం ప్రధానంగా సినిమా తీస్తే ఇతగాడికేమో అసలు కంటే వడ్డీ ముద్దయినట్లు- డైలాగుల, ఫైటింగుల, విధ్వంసక నాయకపాత్ర కంటె- అతనికి బలి అయిన- మంచివాడి- అమాయకపు- పక్కపాత్ర తెగనచ్చేసింది. వార్తాపత్రికలోచి వార్తల కంటె సినిమా బొమ్మలే ఆకట్టుకున్నట్లు ఇలాగ- శరాలు గురితప్పడం అరుదు కాదు అబ్బురమూ కాదు. కామేష్ ఆ పక్క పాత్రకు ఎంత ప్రభావితుడయ్యాడంటే ఒక్కసారిగా అతనిలో ఆ పాత్రలా అతి మంచివాడైపోవాలని మనసు కొట్టుకుపోయింది. ఒట్టుపెట్టేసుకుంది. నేటి కాంపు లీటరు మిశ్రమంలో పావు లీటరే పాలూ మిగిలిన ముప్పావు లీటరూ నీళ్ళలా- నేటి కాలపు సినిమాలో మూడొంతులు హింసా, సెక్సూ, పాటలూ, ఫైటులూ, వగైరాలు ఒక వంతు మాత్రమే మనిషికి ప్రమాదమూ, పాడూ చేయని అంశాలే అయినా కామేష్ అతబడే ప్రేక్షక హంస- ఆ కొంచెం మంచినే గ్రహించేసి మిగిలిన కల్తీని త్యజించేసింది.

మంచి మనిషనిపించుకోవాలని అతను ఆరాటపడిపోయాడు. ఆవేశపడిపోయాడు. ఆత్రత పడిపోయాడు. ఉద్రేకపడిపోయాడు. ఇంకా ఎన్నెన్నో పడిపోయాడు. అదుగో... అప్పటినుంచీ- ఎవరు ఆపదలో చిక్కుకుంటారా, ఆ ఆపదలో చిక్కుకున్న వారిపాలిట ఆత్మబంధువైపోదామా... ఏ కను నుండి కన్నీళ్లు కారతాయా తక్షణం తన కర్చీఫ్‌తో అవి తుడిచేద్దామా... మంచివాడి ఫేసిచ్చేద్దామా... అని అవకాశం కోసం భూతద్దాల కళ్లద్దాలు పెట్టుకు మరీ వెదకసాగాడు. తనకి కావలసిన అవకాశాలెక్క డెక్కడ లభించునా అని తాను చూసిన సినిమాలనీ, చదివిన సీరియల్స్‌నీ గుర్తు చేసుకుంటున్నప్పుడు అతని మనోఫలకం మీద కొన్ని దృశ్యాలు మెదిలాయి. సినిమా రీళ్లలా.

దాహంతోనూ నీరసంతోనూ పడిపోయిన పండు ముసిలి. ఇంకెవరూ అటు చూడడమే లేదు. హీరో మాత్రం పట్టించుకుని... నీళ్లు తెచ్చి... ఆమె తలను తన తొడమీదుంచుకుని... నీళ్లు చిలకరించి... తెలివి తెప్పించి... నీళ్లు తాగిస్తాడు. అప్పుడా అవ్వ "నాలాటి ముసిలిదానికి మంచి నీళ్లిచ్చి ప్రాణం నిలిపిన నువ్వు మామూలు మంచి మనిషివి కావు బాబూ... మనుషుల్లో దేముడివి!" అంటుంది.

నడివయస్సు గుడ్డిది. ట్రాఫిక్‌తో కిటకిటలాడిపోతున్న రోడ్డు దాటలేక నిస్సహాయంగా నిలబడిపోతే అతను అమె చేయి పట్టుకుని ట్రాఫిక్‌ని స్థంభింపజేసి రోడ్డు దాటిస్తాడు. అప్పుడామె- "రెండు నేత్రాలు లేని మావంటి అంధులకి నువ్వు కళ్ళవీ కంటి వెలుగువీ బాబూ!" అని దణ్ణం పెడుతుంది. ఒక పాప నీటిలో పడిపోతుంది. తల్లి తల్లడిల్లిపోతూంది. బ్రిడ్జీ మీంచి చూస్తున్న హీరో అంతెత్తు నుంచీ అమాంతం ఉరికేసి ఆ పాపని రక్షించి ఎత్తుకుని ఆమె కందిస్తాడు. అప్పుడామె ఆనందభాష్పాలు కార్చుతూ అతని చేతులు పట్టుకుని- "మ పాపని రక్షించిన నువ్వే యీ పాపకు నిజమయిన తల్లివీ తండ్రివీ, పాపల పాలిట మాతాపితరులవి" అంటుంది.

అదుగో.. అలాటి సువర్ణ సేవావకాశం కోసమే సినిమాలు సీరియల్సూ మానుకుని మరీ వెదుకుతున్నాడు కామేష్. మరి.. అదేం దురదృష్టమో అలాటిది ఒక్క సంఘటన కూడా లభించడంలేదు. అతని కాశ్చర్యమేసేస్తూంది- యింత దేశంలో సేవ చేస్తానంటే అందుకునే వారే కరువయ్యారేమిటీ అని. తన సందేహాన్ని ఒక మిత్రుడి ముందు బయటపెట్టేశాడు కూడా. అతను ఒక నవ్వు నవ్వి- "మన దేశంలో అవినీతులలాగే ప్రజాసేవ కూడా పెచ్చుపెరిగిపోయి కొంపముంచుతూందోయ్. దేశసేవ చేస్తాం ఎన్నికలలో గెలిపించండి అంటారు రాజకీయ నాయకులు. సేవా సంస్థలు- ప్రజాసేవ చేసేందుకు మార్గాలని- వారం వారం మీటింగులు పెట్టుకుని మరీ అన్వేషిస్తున్నాయి. స్వచ్ఛంద సంస్థల సంగతి సరే. ఇక వీధి వీధికీ వెలసే చిన్నా చితకా ప్రజాసేవా సంస్థల గురించి చెప్పనక్కరనే లేదు. ఇలా ప్రజాసేవతో ప్రజలకు అజీర్ణం తెప్పించేస్తున్నారు. అదేమిటో... ప్రజాసేవ కొందరికి ఫ్యాషనైతే మరికొందరికి లాభసాటి వ్యాపారమైనట్లుంది." అనేశాడు. కామేష్ తేలుకుట్టిన దొంగలా తెల్లమొహం వేసి జారుకున్నాడు. వీడికి మంచీ చెడ్డూ, తీరూ తెన్నూ తెలియవనుకుంటూ.

సిటిబస్సులో ఆసీనుడయ్యాడన్నమాటే కాని ఆలోచనలన్నీ ప్రజాసేవావకాశం మీదనే. అతని శరీరం బస్సులో ఉంది. మనసు మరెక్కడో ఉంది.

"టికెట్" అన్న కండక్టర్ అరుపుకి త్రుళ్లిపడి యీ లోకంలోకి వొచ్చి టికెట్ తీసుకుని... చూట్టూ చూశాడు వీలయిన మేరకు మెడతిప్పి, సిటీ బస్సు సహజంగానే... సిటీ లాగే రష్‌గా వుంది. చీపురు కట్టలో యీనెపుల్లల్లా ఒకరినొకరు అంటుకుపోయీ... సీట్ల మధ్య కూడా నిలుచునీ ఉన్నారు ప్రయాణీకులు- నేటి భారతదేశ జనాభా శీర్షికకు వేసిన బొమ్మలోలా. అదుగో అప్పుడు పడింది కామేష్ దృష్టి అతని మీద.ఒక్కక్షణం... అతని కళ్లకి మెరుపు వొచ్చేసింది. ముఖంలో ఆశ వొచ్చేసింది. సిటీ బస్‌లో కూర్చుని ప్రయాణం చెయ్యడమే కష్టం, కుదుపులు... సడన్ బ్రేకులకి తూలి పడవలసివొస్తూంటూంది. అలాటిది... అంత రష్‌లో, నిలబడి... ప్రయాణం చేయడమంటే- మామూలు వాళ్లకే తెలుగు సినిమా పరీక్ష, మరి అతనేమో వికలాంగుడు, ఒక కాలులేదు. దానికి బదులు క్రచెస్ ఉన్నా అవి నిజం కాలుకి సమానం కావు కదా? అన్నీ సవ్యంగా ఉన్న వాళ్ళే సిటీబస్‌లో నిలుచుని ప్రయాణం చెయ్యజాలరీ రోడ్ల మీద. ఈ వికలాంగుడెంత బాధపడుతున్నాడో పాపం? సీట్లలో సుఖంగా కూర్చున్నవాళ్లింత మందున్నారు. ఒక్కరూ అతని గురించి పట్టించుకోరేం? తను తప్ప. వాళ్లు మనుషులేనా? వాళ్లవి హృదయాలా, పాషాణాలా? ఎవరికీ జాలి కలగదేం? ఎవరూ లేచి ఆ వికలాంగుడికి సీటివ్వరేం?

ఇందుకేనేమో అన్నాడు వేమన- "పురుషులందు పుణ్యపురుషులు వేరయా" అని.

"ఏమండీ! మిమ్మల్నే." పిలిచాడు కామేష్ గట్టిగా. నిజానికతనకి సుమారు పాతికేళ్లుండొచ్చు. మిస్టర్ అని పిలిస్తే బాగానే ఉండేది.

"నన్నేనా! ఏం? నా పేరు సత్యం" అన్నాడా వికలాంగుడు. అపరిచితుడు తనని పిలిచినందుకు కాబోలు కొంచెం ఆశ్చర్యపడుతూ.

"సత్యం గారూ! రండి. నా సీటులో కూర్చోండి" కామేష్ లేచాడు సీటు ఆఫర్ చేస్తూ.

"ఎందుకూ?" మాట చివర దీర్ఘం.. వెటకారంలా ధ్వనిస్తూ..

"మీరు... మీకు కాలు ఒకటి లేదు కదా... నిలుచోలేక యిబ్బంది పడుతున్నారనీ..." తడబడిపోయాడు.

"నేనేమీ యిబ్బంది పడడమూ లేదు, నాకు మీ ఔదార్యంతో నిమిత్తమూ లేదు-" చురుకుగానే కాక కాస్త కరుకుగా కూడా ఉందతని కంఠం. అలా అని అతను తన తలని మరో వేపు తిప్పేసుకున్నాడు. దానితో కామేష్ ఖంగు తిన్నాడు.

పుణ్యానికి పోతే పాపమెదురయిందంటారిదే కాబోలు. పిలిచి సీటిస్తానంటే ఫెడీమని వొద్దన్నాడు! ఎంత పొగరు! ఈ పొగరణచడానికే భగవంతుడు ఒక కాలు విరిచేసి ఉంటాడు. ఇలాటి పొగరుబోతుకి ఆ శాస్తి జరుగవలసిందే. ఆశాభంగంతో కలిగిన ఆగ్రహంతో పెదవి కొరుక్కుంటూ ఉండిపోయాడు కామేష్. తను అపాత్రుడికి సేవ చేయబోయి భంగపడ్డాడు.

అతను దిగవలసిన స్టాప్ దాటాక కొంత దూరంలో ఆగింది బస్సు. తనతో పాటు సత్యం కూడా దిగడంతో ముడుచుకుని అడుగులు వేయసాగాడు.

"సార్" సత్యమే పిలిచాడు. అతనికి దగ్గరగా వొస్తూ.

"చూడండి. ఒక మనిషి అంగవికలుడైనంత మాత్రాన అత్మాభిమానం ఉండకుండా పోనక్కరలేదు. అభిమానమున్న అలాటి మనుషులకి తమ అంగవైకల్యం కంటే దాని మీద యితరులు అనవసరంగా ప్రదర్శించే జాలే ఎక్కువ అసౌకర్యం కలిగించి వదులుతుంది. అంతకంటే బాధా అవమానమూ మరేమీ ఉండవు. అందుకే- బస్సులో నా అంగవైకల్యాన్నీ అశక్తతనీ ఎత్తి చూపుతున్నట్లుగా మీరు నా కోసం లేచి సీటివ్వబోతే అవమాన మనిపించి కొంచెం కఠినంగా ప్రవర్తించాను. అందుకు- అయామ్ సారీ. దేముడు ఒక ద్వారం మూసివేసినా మరో ద్వారం తెరుస్తాడు. ఒకకాలు లేకపోయినా నాలో శక్తీ సహనమూ ఎక్కువే. ఒకరి దయాదాక్షిణ్యాలను భరించవలసిన ఆగత్యం లేదు నాకు. నిజంగా అవసరమయిన వారికీ కోరినవారికీ మీ సహాయమూ సానుభూతీ అందించండి. నాలాటి వాళ్లని మాత్రం మీతో సమానంగా తలచండి తప్ప. సబ్‌స్టాండర్డ్‌గా... లెస్‌మన్‌గా... తక్కు మనుషులుగా చూడకండి. మీరు మాకు చేయగలిగిన ఉపకారం అదే. అదే మాకు సంతోషం కలిగిస్తుంది. బై.." ఉపన్యాసంలా చెప్పేసి.. కర్రకాలు టకటకలాడించుకుంటూ వేగంగా వెళ్లిపోయాడు సత్యం.

నెత్తి మీద వడగళ్ల వాన పడినట్లు నిర్ఘాంతపోయాడు కామేష్. దేముడు మనిషికి అవయవాల నివ్వడంలో కాస్త అటూఇటూ చేస్తాడేమోకాని అహాన్నీ.. ఆత్మాభిమానాన్నీ పౌరుషాన్నీ మాత్రం అందరు మనుషులకీ ఒకేలా యిస్తాడేమో అనిపించిందతనికి. ఆ తరువాత అతనెప్పుడూ పిలవని పేరంటానికి పోలేదు.